సాక్షి గుంటూరు

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



భక్తి సంగీత విభావరి

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన భక్తి గీతాలాపన అలరించింది. పలువురు గాయకులు పాల్గొన్నారు.



భక్తి శ్రద్ధలతో చండీహోమం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో . శనివారం విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీ హోమం నిర్వహించారు.

శివాలయంలో నందీశ్వరుడి పూజ



నాదెండ్ల: గణపవరం గంగాపార్వతీ సమేత సోమేశ్వరాలయంలో శనివారం నందీశ్వరుడి పూజ నిర్వహించారు. అభిషేకాలు జరిపించారు.

న్యూస్‌రీల్

దేవీశరన్నవరాత్రుల గోడ ప్రతుల ఆవిష్కరణ



నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : ఈ నెల 22 నుంచి చుట్టుగుంట శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంలో 22వ దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. దేవస్థానంలో శనివారం మహోత్సవాల గోడప్రతులను కమిటీ సభ్యులతో కలసి ఆమె ఆవిష్కరించారు. వచ్చేనెల రెండో తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, అడకా పద్మావతి, తుమ్మల నాగేశ్వరరావు, కుమ్మర క్రాంతి కుమార్, అంగడి శ్రీనివాసరావు, అడకా శ్రీనివాసరావు, పెద్ద బుజ్జి పాల్గొన్నారు.

గుంటూరులో ఉరుములతో భారీ వర్షం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో శనివారం రాత్రి ఉరుములతో భారీ వర్షం కురిసింది. నగర ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. అరండల్‌పేటలో పైపులైను కోసం తవ్విన గుంతల పక్కన మట్టి రోడ్డుపైనే ఉండటంతో వర్షం నీటితో చిత్తడిగా మారింది. పలువురు పాదచారులు, వాహన చోదకులు జారిపడి గాయపడ్డారు. డొంకరోడ్డులో మూడు వంతెనల వద్ద వర్షపునీటితో రాపోకపోలకు అంతరాయం ఏర్పడింది. కంకరగుంట ఫ్లైఓవర్ వద్ద అండర్‌పాస్ పూర్తిగా నీటి మయం కావడంతో అక్కడ భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.

కార్తికేయుని సేవలో ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డి.శ్రీహరిరావు, డాక్టర్ లీలా రమాదేవి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారు తొలుత ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం పుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అమ్మవారి ప్రతిష్ట తగ్గించేందుకే ఉత్సవ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువున్న కనకదుర్గమ్మ సన్నిధిలో జరిగే దసరా ఉత్సవాలను అపహాస్యం చేయటానికి, అమ్మవారి ప్రతిష్టను, ఖ్యాతిని తగ్గించడానికి కూటమి నేతలు విజయవాడ ఉత్సవ్ పేరుతో అడ్డగోలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్ విమర్శించారు. తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'దసరా ఉత్సవాల పేరుతో కూటమి నేతలు చేస్తున్న కార్యక్రమాల్లో అమ్మవారిని గుర్తు పెట్టుకుంటారా? మీ సినిమా పాటలు గుర్తు పెట్టుకుంటారా?' అని ప్రశ్నించారు. విజయవాడ ఉత్సవ్ పేరుతో రూ.100 కోట్లు దోచుకోవడానికి ఎంపీ కేశినేని చిన్ని తదితర నేతలు పథకం పన్నారని దుయ్యబట్టారు. శ్రేయస్ మీడియాతో కుదుర్చుకున్న ఒప్పందం ఎంతో విజయవాడ ఎంపీ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. విజయవాడలో వందేళ్లగా దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని గుర్తు చేశారు. సంక్రాంతి రోజు విజయవాడ ఉత్సవ్ నిర్వహించొచ్చు కదా? అని ప్రశ్నించారు. హిందూ భక్తులను దోచుకోవడానికి సీఎం చంద్రబాబు అధికారిక ఉత్తర్వులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బు వ్యామోహంతో విష సంస్కృతిని వ్యాప్తి చేస్తున్నారని దుయ్యబట్టారు. విజయవాడ ఉత్సవ్‌కు పర్యటన శాఖ సహకారం, నిధులు ఇస్తోందని కూటమి నేతలు చెప్పటం సిగ్గుచేటన్నారు. బందరు గొడుగుపేట వెంకటేరస్వామికి గొల్లపూడిలో ఉన్న భూముల్లో విజయవాడ ఉత్సవ్ ఎందుకు పెడుతున్నారని నిలదీశారు. అమ్మవారి దసరా ఉత్సవాలను రాష్ట్ర ఉత్సవంగా ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. కూటమి ప్రజాప్రతినిధులు విజయవాడ ఉత్సవ్ ఆహ్వాన పత్రికలు ఇస్తున్నారు తప్ప, అమ్మవారి దసరా ఉత్సవ్ పత్రికలు ఇచ్చారా అని ప్రశ్నించారు.



పత్రికా స్వేచ్ఛను హరించటం సిగ్గుచేటు



ప్రభుత్వాలు, ప్రజలకు మధ్య వారధిగా నిలిచే పత్రికా స్వేచ్ఛను హరించటం సిగ్గుచేటు. ఏ మీడియాకు లేని ఆంక్షలు ఒక్క 'సాక్షి'కే ఎందుకు వర్తిస్తాయో కూటమి సర్కారు జవాబు చెప్పాలి. వాస్తవాలు రాస్తున్నారని ద్వేషమా? నిజాలు నిర్భయంగా వెల్లడిస్తున్నారనే ఆక్రోశంతో చంద్రబాబు, లోకేష్‌లు రగిలిపోతున్నారు. విలేకరుల సమావేశంలో కూటమి కుట్రల గురించి ప్రస్తావిస్తే 'సాక్షి' పై.. ఎడిటర్‌పై కేసులు కట్టడం ఎంతవరకు సమంజసం అనే విషయాన్ని ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు ఆలోచించాలి. నిస్సిగ్గుగా మేం ఏం చేసినా అడిగేవాడు లేడన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కేసులు పెట్టి కలాన్ని, పాత్రికేయులను నిలువరించలేరు. ఈ వాస్తవాన్ని కూటమి సర్కారు ఇప్పటికైనా గ్రహించాలి.

– పోలూరి వెంకటరెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

అక్రమ కేసులు దారుణం



ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ప్రభుత్వ మోసాలను, వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తుందనే 'సాక్షి' ఎడిటర్, విలేకరులపై అక్రమంగా కేసులు పెట్టడం దారుణం. ప్రభుత్వ చర్యలు, తప్పులను పత్రికలు ఎత్తిచూపడాన్ని పాలకులు ఓర్చుకోలేకపోవడం సరికాదు. ఫోర్త్ పిల్లర్‌గా పిలవబడే మీడియాపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలు చేయడం కంటే నిరంకుశత్వం ఇంకేముంది? పోలీసు అధికారుల హక్కులను కాపాడేందుకే రాసిన కథనంపై 'సాక్షి'పై అక్రమ కేసు పెట్టడం విడ్డూరంగా ఉంది. ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న మీడియా రంగాన్ని కూటమి ప్రభుత్వం అణిచివేసేలా చర్యలు చేపట్టడం సరికాదు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇలాంటి పరిస్థితులు లేవు.

– ముప్పంగి వివేకానందరెడ్డి, నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు

గుంటూరు నెత్తిన నీటి కత్తి

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

- వర్షాలకు ప్రధాన, అంతర్గత రహదారులు జలమయం
- వాహనదారులు, ప్రజలకు అవస్థలు
- డ్రెయిన్ల నిర్వహణ అస్తవ్యస్తం
- పట్టించుకోని పాలకులు
- ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కరువు
- వరద కట్టడికి చర్యలు చేపట్టాలని ప్రజల వినతి

చిన్న వర్షాలకే నీట మునుగుతున్న నగరం

నెహ్రూనగర్: రోజు రోజుకీ అభివృద్ధి చెందుతున్న గుంటూరు నగరం వర్షం పడితే చాలు మునిగిపోతోంది. రాజధాని ప్రాంతంలో ప్రముఖమైన నగరంలోని పలు ప్రాంతాల్లోని వీధులన్నీ జలమయంగా మారుతున్నాయి. నగరపాలక సంస్థ కార్యాలయం కూడా మునుగుతుందంటే దీనికి కారణం పాలకుల అసమర్థతే అని చెప్పుకోవాలి. వర్షం పడితే చాలు ప్రధాన రోడ్లన్నీ మోకాళ్ల లోతు దాకా వర్షపు నీటితో నిండిపోతున్నాయి. వాహనాల రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలు నీళ్లలో నాని మొరాయిస్తున్నాయి. మరమ్మతులు చేయించుకోవడానికి తడిసి మోపెడవుతోంది. మరో పక్క ఇళ్లలోకి నీరు చేరుతోంది. గృహోపకరణాలు పాడైపోతుండటంతో సామాన్యులు ఆర్థికంగా నష్టపోతున్నారు.



నగరంలో మునిగిపోయిన ఇల్లు (ఫైల్)

తూతూమంత్రంగా డ్రెయిన్లలో పూడికతీత పనులు

గుంటూరు నగరంలో 210 కిలోమీటర్ల మేర డ్రెయిన్లు విస్తరించి ఉన్నాయి. వీటిలో మేజర్ 125.28 కిలోమీటర్లు, మీడియం 67.41 కిలోమీటర్లు, మైనర్ 16.25 కిలోమీటర్లుగా ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభానికి ముందే మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ కింద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపడుతుంటారు. ఈ ఏడాది ఇంజినీరింగ్ అధికారులు రూ.4.78కోట్లతో పనులు ప్రారంభించారు. అయితే, కాంట్రాక్టర్లు పైపైన పూడిక తీయడం, బిల్లు పెట్టుకోవడం పరిపాటిగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమన్వయం కరువు

మొండిగేటు అవుట్ ఫాల్ డ్రెయిన్ విస్తరణకు రైల్వేశాఖకు నగరపాలక సంస్థ నుంచి ఖర్చును చెల్లించినప్పటికీ ఫలితం లేదు. రైల్వే అధికారులను సమన్వయం చేసుకుని డ్రెయిన్ విస్తరణ చేయడంలో నగరపాలక సంస్థ అధికారులు విఫలం అవుతున్నారు.

ఆక్రమణల తొలగింపుకు అడ్డుపడుతున్న ఎమ్మెల్యేలు?

ఎమ్మెల్యే అండ చూసుకుని నగరంలో ఎటూ చూసిన డ్రెయిన్లను ఆక్రమించుకుని నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటిని అడ్డుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో డ్రెయిన్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇటీవల కమిషనర్ తన రోజువారీ పర్యటనలో ఆక్రమణలు తొలగించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేదు. స్థానిక ఎమ్మెల్యేలు అడ్డుపడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు.



భారీ వర్షం వస్తే నగరపాలక సంస్థ కార్యాలయం మునిగిపోయే పరిస్థితి(ఫైల్)

మధ్యలో నిలిచిన డ్రెయిన్ల నిర్మాణం

నగరంలో వర్షం నీరు ఎప్పటికప్పుడు బెయిల్ అవుట్ అయ్యే విధంగా బృందావనం అపార్ట్‌మెంట్(ఏటుకూరు వెళ్లే రోడ్డు) నుంచి పొన్నూరు రోడ్డులోని డ్రెయిన్‌కు అనుసంధానంగా 14వ వార్డులో 800 మీటర్ల పొడవుతో రూ.3.50కోట్లతో డ్రెయిన్ నిర్మాణ పనులు పార్ట్ పార్ట్‌లుగా చేపట్టారు. అయితే, ఇది మధ్యలోనే నిలిచిపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో నగరంలో వీధులన్నీ జలమయంగా మారుతున్నాయి. మూడు వంతెనలు వద్ద రైల్వే ట్రాక్ కింద నుంచి మరొక డ్రెయిన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ వాటి అమలుకు పాలకులు తగిన చర్యలు తీసుకోవడం లేదు. రూ.5.50కోట్లతో మూడు వంతెనలు ఆధునీకరించినప్పటికీ చిన్న వర్షం పడితే చాలు మోకాళ్లలోతు దాకా నీళ్లు వస్తున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా రైల్వే ట్రాక్ కింద డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దీంతో పాటు కంకరగుంట అండర్ పాస్ వద్ద వర్షం పడిన ప్రతిసారి మునిగిపోతోంది. దీనికి కూడా పాలకులు శాశ్వత పరిష్కారం చూపాలని నగర వాసులు కోరుతున్నారు.



ఇటీవల వర్షాలకు నీట మునిగిన కంకర గుంట అండర్ పాస్

పరిష్కార మార్గాలపై దృష్టి పెట్టని పాలకులు

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వర్షం పడితే ఆ ప్రాంతం అంతా వర్షపు నీటితో నిండిపోయి ఆ ప్రభావం తూర్పు నియోజకవర్గంపై పడుతోంది. పశ్చిమ నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు 3వ వార్డులోని మొండిగేటు నుంచి బయటకు వెళుతుంటుంది. మొండిగేటు అవుట్ ఫాల్ డ్రెయిన్ వద్దకు 100శాతం మురుగు నీరు వస్తే అందులో 10శాతం మాత్రమే బయటకు వెళుతోంది. ఆ ప్రభావం మొత్తం 3, 4, 8 వార్డులపై పడి పలు కాలనీలు నీట మునుగుతున్నాయి. దీని విస్తరణ కోసం పాలకులు, అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు.



వర్షం పడిన ప్రతిసారి మూడు వంతెనల వద్ద పరిస్థితి

వర్షం పడితే బయటకు రాలేని పరిస్థితి



వర్షం పడిన ప్రతి సారి రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. మోకాళ్ల లోతు దాకా నీరు రావడంతో ద్విచక్రవాహనం మీద బయటకు వెళ్లాలంటే భయంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు బండి తడిసిపోయి స్టార్ట్ కావడం లేదు.

– జగదీష్‌కుమార్, నెహ్రూనగర్

విచిత్ర వాతావరణం



ఉదయం పూట ఎండగా ఉంటోంది. రాత్రి అయితే చాలు వర్షం విపరీతంగా కురుస్తోంది. ఇటువంటి వాతావరణ పరిస్థితులు ఎప్పుడు చూడలేదు. ఈ వర్షాల దెబ్బకు డ్రెయిన్లు పొంగిపోయి ఇళ్లు మునిగిపోతున్నాయి.

– లక్ష్మి, స్తంభాల గరువు

డయేరియా కేసులు @100

- తగ్గుముఖం పట్టని వ్యాధి
- కలుషిత నీరు కాదంటూ కమిషనర్ ప్రకటన
- నీటి వల్లే అంటున్న వైద్యులు
- పొంతలేని సమాధానాలతో అయోమయం

సాక్షి ప్రతినిధి, గుంటూరు : గుంటూరులో డయేరియా కేసులు సెంచరీకి చేరువలో ఉన్నాయి. తగ్గుముఖం పట్టకపోగా రోజ రోజుకీ పెరుగుతుండటంతో ప్రజల్ని ఆందోళనకు గురి చేస్తోంది. శనివారం ఉదయానికి జీజీహెచ్‌లో బాధితుల సంఖ్య 92కు చేరింది. సమస్య పరిష్కారానికి కృషి చేయకుండా అధికారులు పొంతన లేని ప్రకటనలు చేస్తున్నారు. కలుషిత నీరు కాదు, కలుషిత ఆహారం వల్లే సమస్య ఏర్పడిందంటూ కమిషనర్ డయేరియా వెలుగు చూసిన రోజే ప్రకటన చేయడం వివాదాస్పదంగా మారింది. జీజీహెచ్ వైద్యులు మాత్రం కలుషిత నీటి వల్లే ఈ సమస్య ఏర్పడిందని స్పష్టంగా చెబుతున్నారు.

బాధితులు సంఖ్య బయటపెట్టని అధికారులు

జీజీహెచ్‌కి వచ్చిన కేసులను కూడా పూర్తిగా బయటపెట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు ప్రైవేటు ఆసుపత్రులకు, ఆర్‌ఎంపీల వద్దకు వెళుతున్న వారు, ఇంటి వద్దనే వైద్యం తీసుకుంటున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉన్నట్లు సమాచారం. అయితే ఈ విషయాలను వెల్లడించకుండా కేసుల సంఖ్యను తక్కువ చేసి చూపిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అతిసార, ఇతర బాధితులను పరామర్శించారు. వైద్య సిబ్బంది సందర్శనలు, స్థానికుల తాగు నీటి వసతులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్యాధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

నగర ప్రజల్లో ఆందోళన

2018లో ఆనందపేటతో పాటు పలు ప్రాంతాల్లో ఇదే విధంగా డయోరియాతో 30 మంది వరకూ మరణించడంతో నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు నగరంలోని 57 డివిజన్లలో పలు ప్రాంతాల్లో ఇంటింటికీ సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల్లోనే దర్శనమిస్తున్నాయి. మరికొన్ని మురుగు కాలువను అనుకొని వెళుతున్నాయి. వర్షం కురిస్తే చాలు పొంగి వాటర్ పైపులైన్లన్నీ కూడా మునిగిపోతున్నాయి. పైపుల్లోకి మురుగు నీరు చేరుతుందని నగరంలోని రామిరెడ్డితోట, ఆనందపేట, దుర్గానగర్, యానాదికాలనీ, తదితర ప్రాంతవాసులు చెబుతున్నారు.



ఆనందపేట 3వ లైనులో కాలువ పక్కనే ఉన్న పైపులైన్లు

రంగు మారిన నది నీరు

నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు కృష్ణానదిలో నీరు కూడా రంగుమారి వస్తోంది. దీన్ని తక్కెళ్లపాడులో శుద్ధి చేసి నగరానికి తాగునీటిని సరఫరా చేస్తుంటారు. సాధారణ సమయాల్లో వాటర్ టర్బీడిటీ(బురద) 5 శాతంగా ఉన్నా వరదల సమయంలో ఇది 20 శాతానికి పైగానే ఉంటుంది. ఈ సమయంలో నీటిని శుద్ధి చేసే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆ దిశగా యంత్రాంగం దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం కూడా క్షీణించింది. ప్రతి రోజు కాలువలను శుభ్రం చేయకపోవడంతో దోమలు పెరుగుతున్నాయి.



రామిరెడ్డితోట 1వ లైనులో మురుగు కాలువలో పైపులైన్లు

మురికి నీళ్లు వస్తున్నాయి



మా ప్రాంతంలో రెండు రోజుల నుంచి మురికి నీరు సరఫరా అవుతోంది. నీరు కూడా వాసన వస్తోంది. తప్పక వాటినే వాడాల్సిన పరిస్థితి నెలకొంది. తాగు నీటి సరఫరాపై అధికారులు దృష్టి సారించాలి.

– అచ్చమ్మ, దుర్గానగర్(సుద్దపల్లి డొంక)

పైపులైన్లలోకి మురుగునీరు



మా ప్రాంతంలో కాలువల్లో పైపులైన్లు ఉన్నాయి. వాటిని అధికారులు తొలగించకపోవడంతో డ్రైనేజీ వాటర్ పైపుల్లోకి చేరుతోంది. దీని వల్ల విరేచనాలు, వాంతులు, జ్వరాలతో బాధపడుతున్నాం.

– ఎండీ.ఎఫ్. షరీఫ్, ఆనందపేట

క్షేత్రస్థాయిలో పటిష్టంగా పనిచేయాలి

కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్ : క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది పటిష్టంగా పని చేయాలని, అతిసార లక్షణాలు కనిపించిన ప్రాంతాల్లో ఆరోగ్య సర్వే రెండు రోజుల్లో పూర్తి కావాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై శనివారం కార్యాలయంలో ఆమె సమీక్షించారు. అనంతరం పోషకాహారంపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని మందులు, ఓఆర్‌ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచాలని, అవసరమైతే తక్షణ వైద్య సేవలు అందించాలని సూచించారు. ఎక్కడైనా ప్రజల్లో అనారోగ్య లక్షణాలు కన్పిస్తే కలెక్టర్ కార్యాలయంలో గల కంట్రోల్ రూమ్ 08963- 2234014 కు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, ఆర్డీఓ ఎస్.ఎస్.కె.ఖాజావలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె. విజయలక్ష్మి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కల్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి. ప్రసూన, జిల్లా విద్యా శాఖ అధికారి రేణుక పాల్గొన్నారు.



పోషకాహారంపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

జీజీహెచ్‌లో రోగులకు పరామర్శ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్, లాంచస్టర్ రోడ్డులోని యూపీహెచ్‌సీని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులను సందర్శించి అతిసార, వైద్య చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. యూపీహెచ్‌సీ నిర్వహించిన స్వస్థ నారి- స్వశక్తి పరివార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. గర్భిణులకు సీమంతం చేశారు.అనంతరం 19వ వార్డు సంగడిగుంటలో ఇంటింటి ఆరోగ్య సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.

యువకుడిపై కత్తితో దాడి

- పరిస్థితి విషమం
- పుట్టిన రోజు వేడుకల్లో శ్రుతిమించిన వివాదం
- ఇరువురిపై కేసు నమోదు

చేబ్రోలు: పుట్టిన రోజు వేడుకల్లో స్వల్ప వివాదం జరిగి ఆవేశంలో కత్తితో దాడి చేయడంతో యువకుడి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరులో శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామానికి చెందిన యువకుడు దానబోయిన మురళి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి పార్టీ ఏర్పాటు చేశాడు. డీజే, డాన్స్ , భోజనాలను ఏర్పాటు చేశాడు. నారాకోడూరు, పరిసర గ్రామాలకు చెందిన మురళి మిత్ర బృందం హాజరయ్యారు. డ్యాన్స్ సందర్భంగా అర్ధరాత్రి సమయంలో మద్యం మత్తులో యువకుల మధ్య వివాదం రేగింది. దీన్ని మనసులో పెట్టుకొని శ్రీకర్, వరుణ్‌లు వేజండ్ల గ్రామానికి చెందిన తోట గౌతమ్ కృష్ణపై కత్తితో ఛాతీపై పొడవటంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. గౌతమ్ కృష్ణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. బాధితుడి తల్లి శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్‌ఐ పి. వీరనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,000** గరిష్ఠం : రూ. **3,000**

మోడల్ ధర రూ. **2,600**

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన పలువురిని పదవుల్లో నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాడికొండ నియోజకవర్గానికి చెందిన ఆవుల రమణారెడ్డిని పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, బి.వెంకటస్వామిని బీసీ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, వంగా సీతారామిరెడ్డిని రాష్ట్ర వలంటీర్ల విభాగం జోనల్ అధ్యక్షుడిగా, సకిల కమలారెడ్డిని రాష్ట్ర పబ్లిసిటీ విభాగం కార్యదర్శిగా, కొరివి రవికిశోర్‌ను రాష్ట్ర వైఎస్సార్ టీయూసీ సహాయ కార్యదర్శిగా, మంగళగిరి నియోజకవర్గానికి చెందిన మున్నంగి వివేకానందరెడ్డిని రాష్ట్ర మున్సిపల్ విభాగం ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత

నలభైకి పైగా లఘు చిత్రాల ప్రదర్శన



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గజల్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఆలపాటి, టీవీ, చిత్రరంగ ప్రముఖులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు – 2026 సన్నాహాల్లో భాగంగా శనివారం కలెక్టర్ బంగ్లా రోడ్ భారతీయ విద్యాభవన్‌లో 'తెలుగు భాషా వికాసం'పై అంతర్జాతీయ లఘు చలన చిత్రోత్సవంలో భాగంగా 44 చిత్రాల ప్రదర్శన నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలని అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాడారని, ఆయన జీవితం తరతరాలకు స్ఫూర్తి కావాలని తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ జాతి అస్తిత్వానికి మాతృభాష కొలమానమని అన్నారు. ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ మాట్లాడుతూ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ద్వారా తెలుగు భాషా వికాసానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని చెప్పారు. రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని మాట్లాడుతూ లలిత కళలు, మన సంస్కృతి గొప్పతనంపై విస్తృత ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో జరిగే మూడో ప్రపంచ తెలుగు మహాసభలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. సభలో వీవీఐటీ విశ్వవిద్యాలయం కులపతి వాసిరెడ్డి విద్యాసాగర్, బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్, నంబర్ వన్ టీవీ చైర్మన్ సుధాకర్‌నాయుడు, చలనచిత్ర ప్రముఖులు దశరథ్, కోన వెంకట్, డి.వై.చౌదరి, బి.వి.ఎస్. రవి, సిరాశ్రీ, సమన్వయకర్త పి.రామచంద్రరాజు, సినీ, టీవీ, రంగాల రచయితలు, దర్శకులు, సాంకేతిక నిపుణులు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు. అనంతరం గిడుగు రామ్మూర్తి పంతులుపై కొత్తపల్లి సీతారాం దర్శకత్వంలో కృత్రిమ మేధస్సుతో రూపొందించిన తెలుగు వెలుగు గొడుగు గిడుగు లఘు చిత్రం ఆకట్టుకుంది. తెలుగు భాష ప్రాధాన్యతపై నలభైకి పైగా లఘు చిత్రాలను ప్రదర్శించారు.

టాప్ 2% సైంటిస్ట్‌లలో విజ్ఞాన్ అధ్యాపకులకు చోటు



అధ్యాపకులను అభినందిస్తున్న చైర్మన్ లావు రత్తయ్య, వీసీ నాగభూషణ్

చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఆరుగురు అధ్యాపకులు వరల్డ్ టాప్ 2% సైంటిస్టులలో చోటు సాధించారని వైస్ చాన్స్‌లర్ పి. నాగభూషణ్ శనివారం తెలిపారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ సర్వే నిర్వహించింది. ఇందులో విజ్ఞాన్స్ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్ అంబటి రంగారావు, డాక్టర్ కె.చంద్రశేఖర్, ఫార్మసీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన డాక్టర్ రుద్రపాల్ మిథున్, అడ్వాన్స్‌డ్ సీఎస్ఈ విభాగానికి చెందిన డాక్టర్ జ్యోత్స్నాదేవి బోడపాటి, కెమికల్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ టి.సుబ్బయ్య, హైదరాబాద్‌లోని ఆఫ్ క్యాంపస్ మెకానికల్ విభాగానికి చెందిన డాక్టర్ ఎండీ రహమాన్‌లు వరల్డ్ టాప్ 2% సైంటిస్టులలో నిలిచారని తెలిపారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఆగస్టు 2025 వరకు ఉన్న ఉత్తమ సైంటిస్టుల డేటాను తీసుకోవడంతో పాటు స్టాండర్డ్ సైన్స్ మేట్రిక్స్ క్లాసిఫికేషన్‌లో గల 44 సైంటిఫిక్ ఫీల్డ్స్, 174 సబ్ ఫీల్డ్స్‌ను పరిగణలోనికి తీసుకుని ఈ ఫలితాలను వెల్లడించిందని వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆరుగురు ప్రొఫెసర్‌లను చైర్మన్ లావు రత్తయ్య, డీన్లు అభినందించారు.

శలపాడులో దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్



పొలాలను పరిశీలిస్తున్న ఏవో ప్రియదర్శిని తదితరులు

చేబ్రోలు: భారీ వర్షాలు, వరదలకు మండలంలోని శలపాడు, వీరనాయకునిపాలెం గ్రామాల్లో నీట మునిగి దెబ్బతిన్న వరి పొలాలను శనివారం వ్యవసాయశాఖాధికారులు పరిశీలించారు. సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన ''రెక్కల కష్టం... వర్షార్పణం'' కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా స్థానిక ఏవో పి. ప్రియదర్శిని మాట్లాడుతూ శేకూరు, శలపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలో రైతులు నాలుగు వేల ఎకరాల్లో వరి సాగు చేశారని తెలిపారు. పంట కూడా 30రోజులు పైబడిన దశలో ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిల్వ ఉన్న పొలాలను పరిశీలించామని, ప్రాథమిక నివేదికను జిల్లా వ్యవసాయశాఖాధికారికి సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యయసాయశాఖ సిబ్బంది, మైలా రామరాజు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

హెల్త్ ఆన్ వీల్స్ రైలులో రెండవ విడత వైద్య పరీక్షలు



ఉద్యోగులకు వైద్య పరీక్షలు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో పెట్టుకుని రెండవ విడత హెల్త్ ఆన్ వీల్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పీఆర్వో డి.వినయ్‌కాంత్ తెలిపారు. శనివారం గుంటూరు–దొనకొండ రైల్వే స్టేషన్ల మార్గంలో ఉద్యోగులకు రెండవ విడత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌కాంత్ మాట్లాడుతూ ఈనెల 13న కార్యక్రమాన్ని డీఆర్ఎం సుదేష్ణ సేన్ ప్రారంభించినట్లు తెలిపారు. మొదటి రోజు గుంటూరు–రేపల్లె మార్గంలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. మొబైల్ మెడికల్ యూనిట్‌లో గుంటూరు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాసు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.సింధు, లలిత, ఒమేగా హాస్పిటల్స్‌తో పాటు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు కలిసి పరీక్షలు నిర్వహించారని తెలిపారు. రైల్వే ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించారని తెలియజేశారు. కార్యక్రమంలో డీఎంఓ గుంటూరు డాక్టర్ ప్రియాంక, డీఎంఓ దొనకొండ డాక్టర్ ప్రకాశ్ పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్ జిల్లా టీం ఎంపిక



గుంటూరు వెస్ట్: బీఆర్ స్టేడియంలో శనివారం అండర్– 14, అండర్– 17, అండర్– 19 జిమ్నాస్టిక్స్ బాలబాలికల జిల్లా టీం సెలక్షన్లు నిర్వహించారు. అండర్– 14, 17 ఎంపికలు ఎస్జీఎఫ్ సెక్రటరీ గోపి, అండర్ –19 ఎంపికలు నరసింహారావు, కోచ్ అఫ్రోజ్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగాయి.

బాలికను వేధించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

తాడికొండ: బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ సీహెచ్.వాసు శనివారం తెలిపారు. తాడికొండకు చెందిన యువతి గుంటూరులోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. గత పది నెలలుగా తాడికొండ గ్రామానికి చెందిన షేక్ అస్లామ్ యువతి కళాశాలకు వెళుతున్న సమయంలో వెంటబడుతున్నాడు. తనను ప్రేమించాలంటూ బలవంతం చేస్తూ లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. యువతి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. ఆమె తాతయ్య నిందితుడిని హెచ్చరించాడు. రెచ్చిపోయిన యువకుడు ఫోన్ చేసి తన ప్రేమను అంగీకరించకపోతే యువతితో పాటు ఆయన్ను చంపుతానని బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ వాసు తెలిపారు.

గంజాయి రహిత జిల్లాగా చేయడమే లక్ష్యం

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: జిల్లాను గంజాయి రహితంగా చేయడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి క్రయ, విక్రయాలు, సరఫరాపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. గడచిన రెండు రోజుల్లో 3.5 కిలోల గంజాయి సీజ్ చేసి, 22 మందిని అరెస్ట్ చేశామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు, అవగాహన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. గంజాయి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై ప్రత్యేక నిఘాతో పాటు పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని, ఆస్తుల జప్తునకు కూడా చర్యలు చేపడతామని వివరించారు. పోలీస్‌స్టేషన్ స్థాయిలోని ప్రత్యేక పోలీస్ బృందాలు, ఈగల్ బృందాల సమన్వయంతో గంజాయి నిర్మూలిస్తామ డ్రోన్ కెమెరాల సాయంతోనూ గుర్తిస్తామని తెలిపారు. జిల్లాలో చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు.

గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా బెల్లం శ్రీనివాసరావు



శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ సింగయ్య

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): గుంటూరు నగర ట్రాఫిక్ డీఎస్పీగా బెల్లం శ్రీనివాసరావు శనివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. 1992 బ్యాచ్‌కు చెందిన ఆయన గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో ఎస్ఐ, సీఐగా పని చేశారు. తెనాలి, గుంటూరు సీసీఎస్, ఎస్బీలో కూడా ఆయన సీఐగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ ఏడాది ఆయనకు డీఎస్పీగా పదోన్నతి లభించింది. ఈ క్రమంలోనే గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా నియమించారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకు ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ సీఐలు అశోక్, సింగయ్యలు అభినందనలు తెలియజేశారు.

ఇలాగైతే కష్టం 'మర్రి'?

- మర్రి రాజశేఖర్‌పై చేరికపై తెలుగు తమ్ముళ్ల గుర్రు
- పార్టీ సభ్యత్వాలకు పలువురు నాయకుల రాజీనామా

నరసరావుపేట: ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తెలుగుదేశం పార్టీలో చేరడంపై ఆ పార్టీ నాదెండ్ల మండల నాయకులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తూ శనివారం తమ పదవులు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌కు తమ రాజీనామా లేఖలు పంపారు. ఈ సందర్భంగా సాతులూరులోని టీడీపీ మండల కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ తన వర్గీయులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ముప్పై ఏళ్లుగా టీడీపీలో వివిధ బాధ్యతలు, ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలకు సేవ చేసిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు కనీసం మాటమాత్రం తెలియపరచకుండా మర్రి రాజశేఖర్‌ను పార్టీలోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో మర్రి రాజశేఖర్ తమపై తప్పుడు కేసులు పెట్టించటమే కాక ఆర్థికంగా నష్టపోయేలా చేశారంటూ ఆరోపించారు. మాజీ మంత్రి విడదల రజినీకి చిలకలూరిపేట ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడంతో ఆ పార్టీలో తనకు విలువ లేకపోవడంతోనే టీడీపీలో చేరాడని విమర్శించారు. మర్రి చేరికతో పార్టీ కోసం కష్టపడిన తమకు విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ అభిప్రాయాలు తీసుకోకుండా ఆయన్ను పార్టీలోకి తీసుకోవడంతో తాము టీడీపీని వీడుతున్నామని పలువురు నేతలు పేర్కొన్నారు.

చేబ్రోలులో అత్యధికంగా 84 మి.మీ. వర్షం

నగటున 23.3 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 84 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా మంగళగిరి మండలంలో 0.8 మి.మీ పడింది. సగటున 23.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పెదనందిపాడు మండలంలో 68.4 మి.మీ., తాడికొండ 34, ఫిరంగిపురం 32.6, వట్టిచెరుకూరు 30.6, గుంటూరు పశ్చిమ 29.4, కాకుమాను 29.4, గుంటూరు తూర్పు 26.4, ప్రత్తిపాడు 26.4, పొన్నూరు 20, పెదకాకాని 14.2, తుళ్లూరు 10.6, మేడికొండూరు 8.8, తెనాలి మండలంలో 3.8 మి.మీ. చొప్పున వర్షం పడింది. సెప్టెంబర్ 20వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 106.3 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 180.8 మి.మీ నమోదైంది.

NOTICE

IN THE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATHI

I.A. NO. 1 OF 2022 IN S.A.No 517 OF 2022

Between:

Katari Sivaiah, S/o. Akkaiah, Aged about 63 years, Occ: Cultivation, R/o.Mallivari Street, Bank Colony, Behind Gopala Krishna Theatre Bazaar, Mangalagiri Town, Guntur District. ... **Petitioner / Appellant**

AND

Devisetty Satyanarayana, S/o. Siva Shankar Rao, aged about 34 years, Occ: Cultivation, R/o Tatavaripalem, Chirala Mandal, Prakasam District and others. ... **Respondent / Respondents**

To

8. Devisetty Srinivasa Rao, S/o.late Bhaskara Rao, aged 45 years, Occ: Agriculture, R/o.Kantheru Village, Tadikonda Mandal, Guntur District. ... **Respondent No. 8**

1.It is hereby informing to you that you are the 8th Respondent in the above said case that our client by name Sri Katari Sivaiah filed IA No. 1 of 2022 in SA No. 517 of 2022 on the file of the Court of the Hon'ble High Court of Andhra Pradesh at Amaravathi to condone the delay of 37 days in filing the second appeal under Section 100 CPC against the Judgment and Decree passed in AS No. 63 of 2014 dated 17.06.2022 of the Court of the Principal District Judge, Guntur, Guntur District wherein confirmed Judgment and Decree passed in OS No. 177 of 2009 dated 15.03.2014 of the Court of the Senior Civil Judge Court, Mangalagiri, Guntur District. The said IA No. 1 of 2022 and IA No. 2 of 2022 in SA No. 517 of 2022 are came up for your appearance, even though we sent the personal notices to you as per the directions of the Hon'ble High Court of Andhra Pradesh through the registered post with acknowledgement due. but your notices were returned with endorsement an "has left without instructions. hence returned to sender", on the said reason. our client enquired about your address in the entire Guntur District. but he was unable to trace out your address, on the said reason, our client filed the IA No. 1 of 2025 in SA No. 517 of 2022 to serve the summons/notices in IA No. 1 of 2022 in SA No. 517 of 2022 in the mode of substitute service through the Telugu Daily News Paper in Guntur District Edition for proper adjudication of the above said case. The said IA No. 1 of 2025 in SA No. 517 of 2022 came up for hearing on 04.09.2025 and same was allowed and posted the matter on 07.10.2025 for your appearance.

It is informing to you that the said IA No. 1 of 2022 in SA No. 517 of 2022 is posted on 07.10.2025 for your appearance. Hence, we are informing to you to appear in person or through an Advocate on 07.10.2025 to defend your stand, otherwise, the case will be heard in your absence as per the records.

KESANA RAMA KOTESWARA RAO, NAGANJANEYULU BORRA, KESANA VISHNU VARDHAN GOUD, SONTI GOPI KRISHNA, PADAMATA YUGANDHAR

ADVOCATES, Near Nirmala School, Atmakuru post, Mangalgiri Mandal Guntur District. Cell No : 6304165415, 9849505079, 9652807533

బహిరంగ ప్రకటన

అసిస్టెంట్ జనరల్ మేనేజరు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యస్.ఎం.ఇ బ్రాంచ్ బృందావన్ గార్డెన్స్, గుంటూరు వారు యావన్మందికి తెలియచేయునది శ్రీమతి తాళ్ళ లావణ్య, భర్త: తాళ్ళ కిషోర్ గారికి సంబంధించిన సేల్ డీడ్ నెం.1579/2022, తేది: 17-03-2022, తెనాలి ఎస్ఆర్ఓలో రిజిస్టర్ కాబడిన గుంటూరు మునిసిపల్ కార్పోరేషన్ ఏరియాలో చేరి, టౌన్ సర్వే [illegible] గోరంట్ల గ్రామము [illegible] డి.నెం.106రు లోని 387.2 చ.గ ఖాళీ నివేశన స్థలమును తనఖాగా పుంచుకొని 2023 సంవత్సరంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యస్.యమ్.ఇ. బ్రాంచ్ గుంటూరు వారు M/s. [illegible] [illegible]

తేది: 20-09-2025 | ప్రదేశం: గుంటూరు

బ్యాంక్ ఆఫ్ బరోడా

లక్ష్మీపురం బ్రాంచి, [illegible] గుంటూరు [illegible]

డిమాండ్ నోటీసు

[illegible]

తేది: 06-09-2025 | ప్రదేశం: గుంటూరు | అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా